# తాళికి విలువెందుకు...?

–ఎ. అన్నపూర్ణ

**కాంతి, ప్రదీప్, శిశిర్ ముగ్గురూ స్నేహితులు. ప్రదీప్, శిశిర్ బిటెక్ చదివి, మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగాలు చేస్తున్నారు.**

**కాంతి ఎంబిఏ చదువుతూంది. ఫైనలియర్. వీళ్ళు ముగ్గురూ ఓ బంధువుల ఇంట్లో పెళ్ళిలో పరిచయం అయ్యారు. కాంతికీ, ప్రదీప్‌లకి పెద్దలు తమ అంగీకారంతో పెళ్ళి నిశ్చయించారు.**

కాంతి చదువు పూర్తయ్యేదాకా ముహూర్తం వద్దని షరతు పెట్టడంతో అలాగే ఆగారు.

వీళ్ళు ముగ్గురూ ఏ క్షణంలో పరిచయస్తులయ్యారో ఆ క్షణం నుంచీ అరమరికలు లేకుండా మరింత పటిష్టమయింది.

ఎక్కడికి వెళ్ళినా ముగ్గురూ కలిసే వెళ్ళాలి. రోజూ వాళ్ళు బీచ్‌లో కలుసుకుంటారు. శెలవు రోజుల్లో ఎవరో ఒకరి ఇంట్లో భోజనం తప్పనిసరి.

ఎలాగో కాబోయే భార్యాభర్తలే కనుక పెద్ద వాళ్ళు కూడా 'ఫ్రీ'గా ఉండటానికి అంగీకరించారు.

అయినా కాంతి, ప్రదీప్ ఎప్పుడూ ఏకాంతం కల్పించుకోలేదు.

వారిమధ్య పెళ్ళి తర్వాత ఏం చేయాలన్న ఆలోచనలే రాలేదు. స్నేహానికి విలువనిచ్చి, వివాహానంతరమే జీవితం గురించి ఆలోచించాలని వాళ్ళు అనుకున్నారు.

ప్రదీప్ ధ్యాసలోపడి చదువు నిర్లక్ష్యం చేయలేదు కాంతి. ఒక కట్టుబాటు, హద్దు, ఒక నిర్ణయం వారి మధ్య అపురూపంగా నిలబడే వుంది.

జనవరి నెల. సంక్రాంతి శెలవులు ఓ వారం రోజులు కలిసి రావడంతో కాంతి 'అరకు వాలీ' వెడదాం అన్నది. అలాగే ఓ రోజు 'సింహాచలం' వెడదాం అన్నాడు ప్రదీప్.

''శిశిర్ నువ్వేం చెప్పలేదేం నీ ఇష్టం కూడా చెప్పు'' అన్నది కాంతి.

''మీరిద్దరూ ప్లాన్ చేశారు కదా. ఆ రోజులు గడిచేసరికి శెలవులు పూర్తయి పోతాయి. కాబట్టి నేను ఏమీ చెప్పలేదు. మీకు ఓ ముఖ్య విషయం చెప్పబోతున్నాను. మీరెటూ మారేజ్ అయ్యాక హనీమూన్ వెడతారు కదా!

నేను బహుశా! అప్పుడు సరిగ్గా అమెరికా వెళ్ళాల్సి వుంటుంది. అప్పుడే మన ముగ్గురం సారీ... మీ ఇద్దరితో నేను విడిపోవలసిన రోజు రావచ్చు.''

''ఓయ్ శిశిర్, నీ మనసంతా అమెరికాలో తిరుగుతోంది బాబూ! ఎప్పుడూ చెప్పలేదేం? అసలు ప్లాన్ ఉన్నట్టు కూడా చెప్పలేదే...'' అన్నాడు ప్రదీప్ నిష్ఠూరంగా.

''ముందే చెబితే బెంగ పెట్టుకుంటావని చెప్పలేదు. ఇప్పుడు చెప్పాలనిపించింది అంతే...

మా ఫ్రెండ్ ఆశయాలు ఫలించి ఉన్నత శిఖరానికి చేరుకోవాలని మా కోరిక. 'కంగ్రాచ్యులేషన్స్' అన్నాడు ఆనందంగా ప్రదీప్.

నేను 'వెళ్ళే రోజు' చెబుతాలే అన్నది కాంతి.

ముగ్గురూ 'అరకు వాలీ' వెళ్ళి రెండు రోజులు గెస్ట్ హవుస్‌లో ఉన్నారు. 'సింహాచలం' వెళ్ళాల్సిన రోజు. మద్రాస్ వీసాకి వెళ్ళాల్సి వుండి శిశిర్ వాళ్ళతో వెళ్ళలేదు.

కాంతి, ప్రదీప్ మోటార్ బైక్‌మీద వెళ్ళారు. అదేరోజు మద్రాస్ ట్రైన్ కాచ్ చేశాడు శిశిర్. అతను తిరిగి రావడానికి వారం రోజులు పడుతుందని చెప్పాడు.

వచ్చేది మూఢ మాసమని, ఇక ముహూర్తాలు ఇప్పట్లో లేవని, కాంతి పరీక్షలు అయ్యే వరకూ ఆగడానికి వీలు లేదనీ, జనవరిలోనే ముహూర్తం నిశ్చయించారు పెద్ద వాళ్ళు.

అంతా వైజాగ్‌లోనే ఉంటారు కాబట్టి పెళ్ళి పనులు అప్పటికప్పుడు పురమాయించుకోవడం, కావలసినవి తెచ్చుకోవడం, ఫంక్షన్ హాల్, కేటరింగ్, బ్యాండ్ అన్నీ తొందరలోనే పూర్తి చేసుకున్నారు.

బంధువులకి ఫోన్ చేశారు. దగ్గిర బంధువులు చాలా మంది వైజాగ్‌లోనే వున్నారు కాబట్టి వాళ్ళకి రావడానికి రిజర్వేషన్లు అక్కడ లేకపోయాయి.

''కాంతి, ఈ శిశిర్ వారం దాకా రానన్నాడు. వాళ్ళక్కడ ఉండిపొమ్మందని, మరో వారం పోస్ట్‌పోన్ చేస్తాడేమో! ఫోన్ చెయ్యి సరిగ్గా ఆ రోజుకి ఉండితీరాలని'' అన్నాడు ప్రదీప్.

అలాగే ఆ రోజు ఫోన్ చేసింది కాంతి. కాని అతను దొరకలేదు. ఎవరో మాట్లాడితే మెసేజ్ ఇవ్వమంది.

'మర్నాడే పెళ్ళి' ఈ శిశిర్ అనుకున్నంత పనీ చేశాడు. వాళ్ళక్కగారి ఫ్యామిలీతో బృందావన్ గార్డెన్స్ చూట్టానికి వెళ్ళాట్ట. బాడ్‌లక్ అన్నాడు ప్రదీప్.

''పోనిద్దూ! ఏం చేస్తాం అనుకోనివి జరుగుతుంటాయి'' అన్నది కాంతి. ఆమెకు ఎందుకో ఈ పెళ్ళి అంత ఉత్సాహాన్ని ఇవ్వలేదు.

''కాంతీ! నీకోసం డైమండ్ రింగ్ కొనాలి పద. ఈరోజు ఆ పని పూర్తి చేద్దాం'' అంటూ షాపుకి బయల్దేర తీశాడు. రింగ్ కొని తిరిగి వస్తుంటే యాక్సిడెంట్ అయింది అతని బైక్‌కి.

శిశిర్‌కి వీసా వచ్చింది. ఈ విషయాన్ని ఫ్రెండ్స్‌కి చెప్పాలని ఆత్రంగా ఉందతనికి.

ఇంటికి వచ్చి అమ్మా, నాన్నలకి చెప్పాడు. ''సరే! బాగుంది. ఎలాగా వస్తుందనుకున్నది వచ్చింది. పెళ్ళి చేసుకుని వెళ్ళిరా నాయనా అని ఎంత బ్రతిమాలినా వినవు కదా'' తల్లి కోపంగా అన్నది.

''ఏమిటమ్మా. పెళ్ళీ, పెళ్ళీ అంటావ్.



పెళ్ళయ్యాక చూశావురా అబ్బాయ్ కోడలు ఇలా అంది, అలా అంది అంటూ నేరాలు చెబుతావ్.''

''నేనేం చెప్పను లేరా ... ఆ పిల్ల ఏవన్నా నోరు మూసుకుని పడి ఉంటాను. నువ్వు మాత్రం పెళ్ళి వద్దనకు. మా బాబువి కదూ?'' అంటూ గొడవ చేయసాగింది.


''చూద్దాంలే! ముందు మా ఫ్రెండ్ ప్రదీప్‌కి శుభవార్త చెప్పి రావాలి'' అంటూ బయల్దేరబోయాడు.

వాళ్ళిద్దరూ మొహమొహాలు చూసుకున్నారు. ప్రదీప్‌కి యాక్సిడెంట్ అయిందని తెలిస్తే వీడ్నసలు పట్టుకోలేం. ఎలా?

ఏదో వొంకన వీణ్ణి ఆపు చెయ్యాలి అనుకుని ''ఒరేయ్ శిశిర్, ప్రదీప్ వాళ్ళూ ఊళ్ళో లేరు'' అన్నారు.

''వాడు లేకుంటే ... కాంతి ఉంటుంది కదా చెప్పి వస్తాను'' వాళ్ళ మాట వినిపించుకోకుండా స్కూటర్ స్టార్ట్ చేశాడు.

కాంతి ఇంట్లో ఎవరూ లేనట్టుంది. డోర్‌బెల్ మోగినా ఎవరూ వచ్చి తలుపు తీయలేదు. పక్క దారిలో నుంచి వెళ్ళి కాంతి రూం తలుపు తట్టాడు. అది దగ్గరగా వేసి ఉన్నట్టుంది. తట్టగానే తెరుచు కుంది.




''కాంతీ ...'' ఎటూ కాని టైంలో నిద్రపోయి లేచినట్టుంది. అతని పిలుపు విని ఉలిక్కిపడి చూసింది.

''రా ... శిశిర్. ఎప్పుడు వచ్చావ్?

లేచి కూర్చుని మంచానికి దగ్గిరగా ఉన్న కుర్చీని జరిపింది.

''అదేంటి కాంతీ ... డల్‌గా ఉన్నావ్. సాయంత్రం పూట నిద్ర పోతున్నావా? బాగా టైర్ అయినట్టున్నావ్. ఫైనలియర్ ఎగ్జామ్స్ దగ్గరికి వచ్చాయి కదూ ... ''

ఏదేదో మాట్లాడుతున్న శిశిర్‌ని చూస్తే నిజం తెలిసినట్టు లేదు అనుకుని, ''శిశిర్... ప్రదీప్‌కి యాక్సిడెంట్ అయింది'' మెల్లిగా మాటలు కూడదీసుకుని చెప్పింది.

''ఔనుట కదూ. అమ్మ చెప్పింది. ఇప్పుడెలా ఉంది?''

''అంటే... అసలు విషయం చెప్పలేదా?...''

ప్రదీప్ ... ఇక ... లేడు శిశిర్ ... లేడు.''

''నువ్వేం చెబుతున్నావ్ కాంతీ. ప్రదీప్ లేడా ... నేను నమ్మలేను.'' శిశిర్‌కి అంతా అయోమయంగా ఉంది. తను మద్రాస్ వెళ్ళి వచ్చేసరికి ఎంత అనర్థం జరిగిపోయిందీ?

అందుకేనా కాంతి వదనం, కాంతి విహీనంగా వుందీ! ఇంతలో వీధి తలుపు తీసుకుని కాంతి అమ్మా, నాన్నలు వచ్చారు.

''బాబూ, చాలా ఘోరం జరిగిపోయింది'' అంటూ శిశిర్‌తో జరిగినదంతా చెబుతుంటే నమ్మక తప్పలేదు.

''ఇప్పుడే ప్రదీప్ ఇంటికి వెళ్ళి వచ్చాం బాబూ ... పాపం? అసలు కష్టమంతా వారిదీ ...''

''అవును మన అదృష్టం బాగుండి పెళ్ళి జరగలేదు. అదే జరిగితే కాంతి వితంతువయ్యేది!''

''వద్దు ... ఆ మాటలు తల్లిగా మాటాడకండి. ఆంటీ ... వినడానికి కర్ణ కఠోరంగా వుంది'' అన్నాడు శిశిర్.

''అవున్నాయనా వినడానికే బాధ కలిగించేది తప్పిపోయినందుకు సంతోషిస్తున్నాను.''

> **''విధి వశాత్తు భర్త మరణిస్తే, మాంగల్యాన్ని తొలగించి స్త్రీని వితంతువుగా ముద్ర వేస్తుంది లోకం. అసలు మాంగల్యమే లేకుంటే ఆ పదాన్ని చెరిపి వేయవచ్చు కదా ..''**

''అమ్మా ... దయచేసి ఇక ప్రదీప్ గురించి మాటాడవద్దు.'' కాంతి వారించడంతో ఆ ప్రసక్తి ఆగిపోయింది.

శిశిర్ రోజూ వచ్చి కాంతికి ధైర్యం నూరిపోసి పరీక్షకి సిద్ధం చేశాడు. క్రమంగా ఆమెలో మార్పు వచ్చింది. పరీక్షలు బాగా రాసింది.

''శిశిర్! నీ పుణ్యమా అని అమ్మాయిని మామూలు మనిషిని చేశావ్. నీ మేలు మరచిపోం! అన్నాడు శ్రీధరం గారు, కాంతి తండ్రి.

స్నేహ ధర్మంతో ప్రోత్సహించాను. అంతకన్నా నేను చేసింది లేదు. స్వతహా తెలివైన కాంతికి ఎవరూ చెప్పాల్సింది లేదు.''

''కాంతీ, తరువాత ఏం చేయాలనుకుంటున్నావ్. ఉద్యోగంలో చేరుతావా, ఎం.టెక్ చేస్తావా?''

''రెండింటికీ ప్రయత్నిస్తాను. ఏది ముందు సాధ్యపడితే అది చేస్తాను'' అన్నదామె.

వారం రోజుల్లో శిశిర్ వెళ్ళిపోతాడు. పెళ్ళి గురించి అతని తల్లి మళ్ళీ కదిపింది.

''బాబూ శిశిర్ నీకు నచ్చిన అమ్మాయి ఉంటే చెప్పు లేదా మమ్మల్ని చూడమంటావా? ఏదిఏమైనా పెళ్ళి చేసుకుని వెళ్ళాల్సిందే'' నిశ్చయంగా చెప్పిందావిడ.

శిశిర్ తల్లికి బదులు చెప్పలేదు. అతని మనసులో ఒక ఆలోచన మెరిసింది.

వెంటనే లేచి కాంతి వాళ్ళింటికి వెళ్ళాడు. వేళ కాని వేళలో వచ్చిన అతణ్ణి చూసి ఆశ్చర్యపడిన వాళ్ళు ''ఏం శిశిర్... ఇలా వచ్చావ్?'' అని అడగలేక ''శిశిర్ నీ ప్రయాణం దగ్గిర పడింది. కొంతకాలం మీ అమ్మగారు నీకోసం బెంగపెట్టుకుంటారు అన్నారు'' ఏదో మాట్లాడాలి అన్నట్టుగా.

''ఔనండీ... మా అమ్మగారికోసం పెళ్ళి చేసుకోక తప్పేట్టు లేదు.

''మీకు, కాంతికీ అభ్యంతరం లేకపోతే నేను మీ అమ్మాయిని రిజిస్టర్ మారేజ్ చేసుకుంటాను'' తన నిర్ణయాన్ని తెలియజేశాడు సూటిగా.

''అంత అదృష్టం కలిగితే కావలసిదేముంది. కానీ ... రిజిస్టర్ మారేజ్ ఎందుకు. ఏ గుడిలో శాస్త్రోక్తంగా'' 'మాంగల్య ధారణో' జరిపించవచ్చు అన్నారు కాంతి నాన్నగారు.

''నాకు అటువంటి పెళ్ళి మీద నమ్మకం లేదండి. ఈ రిజిస్టర్ మారేజ్ చాలు. కావాలంటే రిసెప్షన్, దండలు, ఉంగరాలు మార్చుకోవడం మీ ఇష్టం'' అన్నాడు.

''మీ ఇద్దరూ ఇష్టపడితే, అంతకన్నా కావలసిందేముంది. కాని మాంగల్యం ఎందుకు వద్దంటున్నావో చెబుతావా? తెలుసుకోవాలని వుంది'' అన్నారాయన కుతూహలంగా.

''విధి వశాత్తు భర్త మరణిస్తే, మాంగల్యాన్ని తొలగించి స్త్రీని వితంతువుగా ముద్ర వేస్తుంది లోకం. అసలు మాంగల్యమే లేకుంటే ఆ పదాన్ని చెరిపి వేయవచ్చు కదా ... అనే ఆలోచనతో, తాళి కట్టడం అనే సాంప్రదాయాన్ని సమూలంగా బహిష్కరిస్తున్నాను.''

శిశిర్ మాటలకు కాంతి వదనంలో కోటి కాంతులు విరిశాయి. ''థాంక్యూ శిశిర్. థాంక్యూ వెరీమచ్. ఐ అగ్రీడ్'' అంటూ తన ఆమోదాన్ని తెలిపిందామె.